క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలెక్కాలంటే భయపడుతున్న ప్రజలు

దాబాగార్డెన్స్ : రైలు ఎక్కాలంటే ప్రయాణికులు భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ వైస్ చైర్మన్ తోట వాసుదేవరావు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధిలోనే దేశంలో పలు రైలు ప్రమాదాలు జరిగాయని, ఒడిశా రైలు ప్రమాద ఘటనను మరువక ముందే శుక్రవారం ఉదయం ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో పలు బోగీలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండడం వల్ల ప్రయాణికులు హడలిపోతున్నారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రజల భయాన్ని తొలగించాలని రైల్వే అధికారులను కోరారు. ప్రధాని మోదీ హయాంలో వరుస రైలు ప్రమాదాలపై రైల్వే మంత్రి స్పందించాలన్నారు.

నైపుణాభివృద్ధి కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



సెమ్స్ సీఈవోతో నోడల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ తదితరులు

మురళీనగర్ : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కాలేజీల్లో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. విశాఖ పార్లమెంటరీ పరిధిలోని సెమ్స్‌లో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కాలేజీని (స్కిల్ కాలేజీ) జిల్లా టెక్నికల్ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు కాలేజీలో అమలు చేస్తున్న కోర్సులు, వాటి అమలు తీరును పరిశీలించారు. సెమ్స్ సీఈవో కె.శేతుమాధవన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, మార్కెటింగ్ మేనేజర్ లివింగ్‌స్టన్ ఫ్రాన్సిస్‌లతో స్కిల్ కోర్సులపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఎస్ఎల్‌పీ నిపుణుడు ఎస్‌వీఆర్ నాయుడు పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధకుడిగా గొన్నా అధ్యాపకుడు



ఓమ్ నమఃశివాయను అభినందిస్తున్న గొన్నా కళాశాల యాజమాని హేమచంద్

అగనంపూడి: బిజినెస్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో గొన్నా ఎంబీఏ విభాగం హెచ్‌వోడీ బి.ఓం నమఃశివాయ పరిశోధనలు చేసి.. స్టార్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అవార్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ని సత్కరించారు. కళాశాల యజమాని గొన్న హేమ్‌చంద్ నాయుడు, ప్రిన్సిపాల్ పి.ఎ స్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా.. భరోసా

- ప్రజాసేవకే పునరంకితమైన సచివాలయాలు
- జగనన్న సురక్ష మేలు చేసిందంటున్న లబ్ధిదారులు



సేవలకు సంబంధించి సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కార్పొరేటర్ విల్లూరి



సచివాలయంలో రేషన్ కార్డు కోసం లబ్ధిదారు ఫొటో తీసుకుంటున్న సెక్రటరీ

జగదాంబ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు ఇప్పుడు ప్రజలకు సురక్షితమైన భరోసా కల్పిస్తున్నాయి. ఒకప్పుడు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అప్పటికీ అవి ఎప్పటికి మంజూరవుతాయో తెలియని పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సచివాలయాల నేపథ్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎటువంటి ధ్రువపత్రం కావాలన్నా ఇంటి ముంగిటే అవి లబ్ధిదారులకు అందుతున్నాయి. కొత్తరేషన్ కార్డులు, కార్డులో పిల్లల పేర్లు చేర్పించుకోవడం, ఆదాయ, కుల ధ్రువపత్రాలు అన్నీ ఇట్టే చేతికొస్తున్నాయి. ప్రజాసేవ కోసం వార్డుకు ఒకటో రెండో కాకుండా అయిదు నుంచి ఆరు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు మేలు చేసేలా సేవలందిస్తున్నారు.

నేతల చుట్టూ తిరగనవసరం లేదు..

గతంలో ధ్రువపత్రాలు కావాలంటే ముందుగా స్థానిక నేతల వద్దకు వెళ్లి సిఫార్సు చేయించుకోవాలి.. లేదా డబ్బు ఖర్చు చేయాలి. ఇప్పుడు అటువంటి లావాదేవీలకు స్వస్తి పలికింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. లబ్ధిదారులు వెళ్లకుండానే సచివాలయాల ద్వారా వలంటీర్లు ఆయా పనులు పూర్తి చేసి అందజేస్తున్నారు.

ఆధార్ కార్డుకు వచ్చాం..



ఆధార్ కార్డు కోసం వచ్చాం.. వెంటనే పనులు చేశారు. గతంలో ఆధార్ సెంటర్‌కు వెళ్లి రావాలంటే రోజు పనిలా ఉండేది. ఇప్పుడు ఇంట్లో పనులు చూసుకుని వస్తే వెంటనే ఇక్కడ పనులు అయిపోతున్నాయి.

-అలవన సత్యవతి, 35వ వార్డు పండావీధి నివాసి.

ప్రభుత్వ సేవలు చాలా బాగున్నాయి..



రేషన్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం తిరిగితే ఆరోజు కూలి పోయేది. ఇప్పుడు రేషన్ కార్డు పని మీద సచివాలయానికి వచ్చాం. రాగానే వెంటనే పని చేసేశారు. మా పనులు ఆగలేదు. ఈ ప్రభుత్వ సేవలు చాలా బాగున్నాయి.

-రమేష్, ప్రసాద్‌గార్డెన్స్.

మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



అన్నసమారాధన, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు



వైఎస్సార్ అభిమాని రామకృష్ణ

దాబాగార్డెన్స్ : మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 74వ జయంతిని పురస్కరించుకుని కువైట్‌లో ఉపాధి పొందుతున్న నగరానికి చెందిన వేగి రామకృష్ణ శుక్రవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో వృద్ధులు, అన్నార్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం నాయకుడు యాసిన్ బాబ్జి, సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఫోన్‌లో మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్సార్ నిత్యం తాపత్రయపడేవారని, తండ్రి ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్న గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడి అని కొనియాడారు. రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టిన రోజున తాను కువైట్‌లో ఉంటున్నప్పటికీ స్నేహితుల ద్వారా ప్రేమసమాజం, స్వామి వివేకానంద సంస్థల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



ఫిషింగ్ హార్బర్ వద్ద చెత్తకు ఫొటో తీస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



80 అడుగుల రోడ్డు అభివృద్ధికి అధికారులతో చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్-3, 4 పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జగదాంబ జంక్షన్, పూర్ణామార్కెట్, మెయిన్‌రోడ్డు, పాతపోస్టాఫీస్, పోర్టు రోడ్డు, పాత మున్సిపల్ ఆఫీస్, ఫిషింగ్ హార్బర్, సత్యం జంక్షన్, హెచ్‌బీ కాలనీ, పాత వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ప్రాంతంలో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, ముఖ్యంగా ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో చెత్త ఎక్కువగా ఉందని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే చెత్త తొలగించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో డంపర్‌బిన్లు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023 బృందం రానున్న దృష్ట్యా ప్రతి ప్రాంతం శుభ్రంగా కనిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరుగ్గా ఉన్న గల్లీ ప్రాంతంలో కాల్వలోని వ్యర్థాలు తొలగించాలన్నారు. ప్రతి రోజూ ఇంటింటికి చెత్త తరలించే వాహనాలు వస్తున్నా, ఇంకా చెత్త రోడ్డుపై ఎందుకు పడుతుందని ఆరా తీశారు. రోడ్డుపై చెత్త వేయకుండా చెత్త తరలించే వాహనానికి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సత్యం జంక్షన్ నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వేంకోజీపాలెం వరకు 80 ఫీట్ రోడ్డును అభివృద్ధి పరిచేందుకు జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటనలో ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : యువత క్రీడల్లో రాణించాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. వార్డులో రామకృష్ణ జంక్షన్‌లో గల పార్కులో మూడు రోజుల పాటు జరగనున్న కేబీటీ క్రికెట్ (విండ్‌బాల్) టోర్నమెంట్‌ను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. నిర్వాహకులు సతీష్, మను మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొంటున్నాయన్నారు. గెలిచిన వారికి మొదటి, రెండు, మూడవ బహుమతులు ఉంటాయన్నారు. ట్రోఫీలను పద్మవతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నగరంలో అయోధ్య రాముని పాదుకలు

మద్దిలపాలెం: అయోధ్య రామయ్య పాదుకలు దేశ వ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం నగరానికి చేరుకున్నాయి. పాత వెంకోజీపాలెం రామాలయంలో కొద్ది గంటల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రంపా రాము ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి పాదుకలను మంగళవాయిద్యాల మధ్య తిరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు చేరువగా సేవలు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పీతల వాసు

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే జగనన్న సురక్ష కార్యక్రమమని దక్షిణ నియోజకవర్గం 4 మండల కన్వీనర్ పీతల వాసు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సలహాలతో శుక్రవారం పెయిన్‌దొరపేట, నేవల్ క్యాంటీన్, జబ్బరతోట సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో ఎలా మాట్లాడాలి. పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, నిమ్మకాయల ఆదిలక్ష్మి, ఆకుల యేసు, వెంకటలక్ష్మి, కాసారపు వాసు, చెన్నా ఆనంద్, రోజా, రమణి, పలువురు కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ బానిసత్వం



కుటుంబాలతో పాదయాత్ర చేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు బానిసత్వం అమలవుతోందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాస్తా ప్రధాని ప్రదేశ్‌గా మారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేఎం శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, నమ్మి రమణ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ తదితరులు మాట్లాడారు. దీక్షా శిబిరం నుంచి కొత్త గాజువాక, గాజువాక మెయిన్‌రోడ్డు, పాత గాజువాక జంక్షన్ వరకూ కార్మికులు కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, కొవిరి కోదండరావు, ఎం.రాంబాబు, పల్లేటి పోలయ్య, పితాని భాస్కర్, ఉమ్మిడి అప్పారావు, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి భూలోకరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

9న విద్యార్థులకు వక్తృత్వ పోటీ

దాబాగార్డెన్స్ : మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 9న వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు మాస్టర్‌మైండ్స్ వైజాగ్ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం ప్రధానమంత్రి సంతకం కన్నా ఎంతో విలువైనదని ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోదీ తెలిపిన నేపథ్యంలో ఆ అంశంపై 9, 10 తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు ఉదయం 9 నుంచి నిర్వహించనున్న పోటీల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియం విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి 3 నుంచి 5 నిమిషాల సమయం ఇస్తామని, ఆ సమయంలో ప్రధాని చెప్పిన ఆ స్టేట్‌మెంట్ గురించి భావాన్ని వ్యక్తీకరించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జూమ్ యాప్ ద్వారా గ్రాండ్ ఫైనల్స్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు వీఐపీ రోడ్డు, షాపర్స్ స్టాప్ వెనుక గల మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో సంప్రదించవచ్చు. లేదా 9248445608 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో భద్రత తనిఖీలు



సింహాచలం రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం అనూప్ కుమార్

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, సింహాచలం రైల్వేస్టేషన్ల పరిధిలో శుక్రవారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి భద్రత తనిఖీలు చేపట్టారు. డివిజన్ పరిధిలో ప్రతీ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించి.. పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టనున్నట్లు డీఆర్ఎం తెలిపారు. భద్రత ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌పై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు, సింహాచలం ఆటో యూనియన్ ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి పలు సమస్యలను వివరించారు.

వీధిలైట్లు వెలిగించరూ..



వీధిలైట్లు వెలిగించాలని కార్పొరేటర్ సాధిక్‌ను కోరుతున్న ప్రజలు

జగదాంబ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. శనివారం కోటవీధి, పెర్రివీధి, అబుసరంగా వీధుల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు వీధిలైట్లు వెలగక ఇబ్బంది పడుతున్నామని ఆయనకు తెలిపారు. స్పందించిన ఆయన త్వరలోనే వీధిలైట్ల సమస్య పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమానికి 19 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళికా అధికారి సునీత

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన 'టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం' కార్యక్రమానికి 19 ఫిర్యాదులు వచ్చాయి. జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి మూడు, జోన్-3 నుంచి నాలుగు, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఏడు, జోన్-8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలపైన, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులు చేయాలన్నా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తెలపవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరు 8187897569కు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదులో పూర్తి వివరాలు.. పేరు, డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా.. సమస్యతో కూడిన సమాచారాన్ని పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీప్లానర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్ యాదవ్

ఏయూక్యాంపస్ : గొర్రెలు, మేకలు పెంపకం దారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఏపీ గొర్రెల పెంపకం దారుల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంపకం దారులు తమ సమస్యలను వివరించారు. ప్రతీ మండలంలోని బంజరు భూములను పెంపకందారులకు కేటాయించాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాదంలో, పిడుగుపడి మరణించిన కాపర్లకు రూ.10 లక్షలు పరిహారం కల్పించాలని, వివిధ సందర్భంలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ, జిల్లా గొర్రెలు పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస రావు, పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఎం.వి. కృష్ణారావు, తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ డీవీవీ సత్యనారాయణ మూర్తి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ సంచాలకులు, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవాల పెంపకం, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన చర్యలు, శాస్త్రీయ యాజమాన్య విధానాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు సూచనలు చేశారు.

నేటి నుంచి సత్యభామ యువ నృత్యోత్సవాలు



పద్మశ్రీ శోభానాయుడు యువపురస్కారం స్వీకరించనున్న శ్రావణి



పద్మశ్రీ శోభానాయుడు ఎక్సలెన్స్ అవార్డు పొందనున్న డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి



సత్యభామ అవార్డుకు ఎంపికైన సుకుమార్

మద్దిలపాలెం : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అంతర్జాతీయ స్థాయిలో సత్యభామ యువ నృత్యోత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు ఎన్‌ఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన నృత్య బృందాలు పాల్గొంటున్నాయన్నారు.

విశిష్ట పురస్కారాల ప్రదానం

నాట్యరంగంలో నిష్ణాతులైన నాట్య కళాకారులకు 2023వ సంవత్సరానికి సత్యభామ పురస్కారాలు అందజేయనున్నారు. సిద్ధేంద్ర యోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి పద్మశ్రీ శోభానాయుడు స్మారక ఎక్సలెన్స్ పురస్కారం, యునైటెడ్ అరబిక్‌కు చెందిన తెన్నేటి శ్రావణికి శోభానాయుడు యువ పురస్కారం, వేదాంతం లక్ష్మీనరసింహశాస్త్రికి యువ పురస్కారం, కూచిపూడికి చెందిన వేదాంతం వాగ్దేవి ప్రసాద్‌కు, చిత్ర సుకుమార్‌కు సత్యభామ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. సూడగాని గీతా నారాయణ్‌కు సత్యభామ ఎక్సలెన్స్ అవార్డు, సత్యభామ బెస్ట్ టీచర్ అవార్డులను వి.వి.ఎస్.జగన్నాథరావు(కూచిపూడి), జి.మాయరాణి(మోహినీయాట్టం), ఎస్ఎస్‌వీ సత్యభామ(కూచిపూడి), బి.విజయ జ్యోతి పరమేష్(కూచిపూడి), ఎం.భారతి(భరతనాట్యం) స్వీకరించనున్నారని విక్రమ్ గౌడ్ తెలిపారు.